మంచిర్యాలలో తగ్గిన పోలింగ్

- 2018లో 73.37 శాతం
- ఈసారి 69.16 శాతమే నమోదు
- హాజీపూర్‌లో అధికం, నస్పూర్‌లో అత్యల్పం
- మహిళా ఓటర్లదే ఆధిపత్యం

మంచిర్యాలటౌన్‌: ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. మంచిర్యాల నియోజకవర్గంలో గతంలో కంటే ఈసారి ఎన్నికల్లో ఓటు నమోదు శాతం తగ్గింది. 2018 ఎన్నికల్లో 73.37 శాతం పోలింగ్ జరగ్గా, ఈసారి మాత్రం 69.16 శాతం పోలింగ్ నమోదైంది. ఈ రెండు ఎన్నికలతో పోలిస్తే 2014 శాసనసభ ఎన్నికల్లో 64.62 శాతం మాత్రమే ఓటింగ్ నమోదు కావడం గమనార్హం. నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో మహిళలే అధికంగా ఉండగా, పురుషులు వెనుకంజలో ఉన్నారు. అత్యధికంగా హాజీపూర్ మండలంలో 82.73 శాతం పోలింగ్ నమోదు కాగా, నస్పూరులో అత్యల్పంగా 58.76 శాతం నమోదైంది.

ఓటర్ల వివరాలు

మండలం	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
దండేపల్లి	40,828	20,014	20,813	1
లక్సెట్టిపేట	42,082	20,472	21,609	1
హాజీపూర్	26,883	13,334	13,549	0
మంచిర్యాల	96,406	47,913	48,482	11
నస్పూర్	68,608	35,027	33,569	12
మొత్తం	2,74,807	1,36,760	1,38,022	25


మంచిర్యాలలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు, పురుషులు

పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నవారు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ శాతం
దండేపల్లి	15,486	17,227	1	32,714	80.13
లక్సెట్టిపేట	16,046	17,111	0	33,157	78.79
హాజీపూర్	10,964	11,276	0	22,240	82.73
మంచిర్యాల	30,725	30,904	3	61,632	63.93
నస్పూరు	20,761	19,553	0	40,314	58.76
మొత్తం	93,982	96,071	4	1,90,057	69.16

దండేపల్లిలో..

దండేపల్లి: మండలంలో 80.13శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 40,828 మంది ఓటర్లకు గాను 32,714 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. మొత్తం 49 కేంద్రాలు ఉండగా, అందులో కుందేల్‌పహాడ్‌లోని కేంద్రం నంబర్ 41లో అత్యధికంగా 92.82 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా దండేపల్లి కేంద్రం నంబర్ 48లో 72.56 శాతం పోలింగ్ నమోదైంది. పెద్దపేట కేంద్రం నంబర్17ను మోడల్ కేంద్రంగా ఏర్పాటు చేసినా పోలింగ్ 79 శాతా నికి మించలేదు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రం నెం.46ను మహిళా పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. అందులో పోలింగ్ 75 శాతానికి మించలేదు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి పోలింగ్ శాతం తగ్గింది. 2018 ఎన్నికలతో పోల్చితే ఈసారి కాస్తా దిగువన పడిపోయింది. గురువారం జరిగిన ఎన్నికల్లో 81.19 శాతం, 2018లో 83.16 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోల్చితే కనిష్టంగా 2 శాతం తగ్గుముఖం పట్టింది. గత ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 1,52,905 మంది ఉండగా ప్రస్తుత ఎన్నికల్లో ఆ సంఖ్య 1,73,335 మంది ఉన్నారు. ఐదేళ్లలో 20,430 మంది ఓటర్లు పెరిగారు. కాగా, ఈసారి పోలింగ్ శాతం స్వల్పంగా తగ్గడం విశేషంగా చెప్పవచ్చు. బెల్లంపల్లి మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా పోలింగ్ జరగడం ఓటరు చైతన్యానికి అద్దం పడుతోంది.

వీరాపూర్‌లో అత్యధికం.. మాదారంలో అత్యల్పం

అసెంబ్లీ నియోజకవర్గంలో 227 పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటన్నింటిలో కన్నెపల్లి మండలం వీరాపూర్‌లో అత్యధిక పోలింగ్ నమోదైంది. ఆ గ్రామంలో 152 పోలింగ్ కేంద్రంలో 97.92 శాతం పోలింగ్ జరగగా అత్యల్పంగా తాండూర్ మండలం మాదారం 132 కేంద్రంలో 56.07 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. వీరాపూర్‌లో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. ఓటు హక్కు వినియోగించుకోవడానికి గ్రామీణులు పోటీపడి అత్యధికంగా పోలింగ్ జరగడానికి దోహదపడ్డారు. కాగా, ఎన్నికల వేళ ఇదే గ్రామంలో ఇద్దరు పోలీసులను చితకబాదిన ఘటన సంచలనం సృష్టించగా, ప్రస్తుతం అత్యధిక పోలింగ్ జరిగి ఆ గ్రామం మరో రికార్డును సృష్టించింది. ఇదేక్రమంలో మాదారంలో ఆ ఉత్సాహం కానరాకపోవడం ఓటర్లలో ఆవరించిన నిరాసక్తతను ప్రస్ఫుటం చేస్తోంది.

ప్రత్యేకతను నిలుపుకున్న కన్నెపల్లి మండలం..

ఈసారి ఎన్నికల్లో కన్నెపల్లి మండలం ఎంతో ప్రత్యేకతను ఏర్పర్చుకుంది. ఈ మండలంలో ఉన్న 11 గ్రామాలు ఏకంగా 90 శాతానికి పైగా పోలింగ్ నమోదు చేసుకోవడం విశేషమనే చెప్పాలి. జన్నాపూర్ 149 పోలింగ్ కేంద్రంలో 92.83 శాతం, జజ్జరవెల్లిలోని 150 పోలింగ్ కేంద్రంలో 90.57 శాతం, ఇదే గ్రామంలోని 151 కేంద్రంలో 93.25 శాతం, రెబ్బెన 153 కేంద్రంలో 91.12 శాతం, ముత్తాపూర్ 154 కేంద్రంలో 92.44 శాతం, మన్నెగూడ 156 కేంద్రంలో 92.81 శాతం, నాయకునిపేట 157 కేంద్రంలో 92.11 శాతం, బొగ్గుగూడెం 158 కేంద్రంలో 94.09 శాతం, కన్నెపల్లి 160 కేంద్రంలో 92.38 శాతం, 161 కేంద్రంలో 92.08 శాతం, గొల్లఘట్ 162 కేంద్రంలో 94.47 శాతం పోలింగ్ నమోదు చేసుకుంది.

అభ్యర్థుల్లో ఆందోళన

అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక పోలింగ్ నమోదు కావడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పెరిగిన పోలింగ్ శాతం ఓ అభ్యర్థికి ప్రతికూలంగా ఓట్లు పడ్డట్లు చర్చించుకుంటుండగా ప్రత్యర్థి అభ్యర్థికి ఓట్ల శాతాన్ని పెంచుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కన్నెపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పెరిగిన పోలింగ్ శాతంపై విజయావకాశాలు ఓ అభ్యర్థికి మెరుగుపర్చినట్లు చెబుతున్నారు. ఈ మండలంలో ఆదినుంచి ఓ రాజకీయ ఆధిపత్యం కొనసాగుతోంది. ఈసారి ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి విజయం కోసం పట్టుదలతో పనిచేసి అత్యధికంగా ఓట్లు పడేలా ప్రచారం చేయడంతో ఓటర్లు కేంద్రాలకు పోటెత్తినట్లుగా రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి.

బెల్లంపల్లి మున్సిపాలిటీలో..

విద్యావంతులు, కార్మికవర్గం నివాసం ఉండే అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లిలో పోలింగ్‌శాతం సాధారణస్థాయిలో నమోదైంది. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో కనిష్టంగా 65 శాతం నుంచి గరిష్టంగా 85కు మించలేదు. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. తగ్గిన పోలింగ్ శాతం రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

ఫలితాలపైనే చర్చ

- గెలుపోటములపై ముచ్చట
- ఎక్కడా చూసిన ఇదే తీరు


దండేపల్లి మండలంలో చర్చించుకుంటున్న గ్రామస్తులు

మంచిర్యాలఅగ్రికల్చర్‌: ఎన్నికల పోలింగ్ గురువారం ముగిసింది. జిల్లాలో ఏ నలుగురు గుమిగూడిన గెలుపోటములపైనే శుక్రవారం చర్చ జరుగుతుంది. గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద, వంట పొలాలు, తెల్లకల్లు చెట్లళ్ల, చెట్ల నీడన, రచ్చ బండల కాడ, పట్టణాల్లో టీస్టాళ్లు, హోటళ్లు, కార్యాలయాల్లో, దుకాణాల సముదాయాల్లో ఎక్కడ చూసిన ఫలితాలపై దృష్టి. ఓ ప్రధాన పార్టీ గెలుస్తుందని, లేదు లేదు ఈ పార్టీనే గెలుస్తుందని చర్చించుకుంటున్నారు. మొదటి నుంచి ఆ పార్టీ ప్రచారం బాగా చేసింది. కాని డబ్బులు ఇవ్వకపోవడం వల్లనే వెనకబడిందని అంటున్నారు. పోలింగ్ ముందు రాత్రి ఈ పార్టీ క్వార్టర్ రూ.1000 నుంచి రూ. 1500 డబ్బులు ఎక్కువగా ఇచ్చిందని, లేదు ఆ వాడలో కొందరికి ఇచ్చి మరో వాడలో ఎక్కువగా ఇచ్చారని చర్చ జరుగుతోంది. దీంతోపాటు కొంత రాజకీయాల మీద ఆసక్తి ఉన్న వారు.. మీ నియోజకవర్గంలో ఎట్లుంది.. ఎవరు గెలుస్తారని ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారి బంధువులకు ఫోన్లుచేసి మరీ తెలుసుకుంటున్నారు. గురువారం సాయంత్రం నుంచే టీవీల్లో ఎగ్జిట్‌పోల్స్ సర్వేలు పార్టీల ఫలితాలు వెల్లడించాయి. వాటి ఆధారంగా కొందరు..చేసిన పార్టీ చేసిన అభివృద్ధి, అభ్యర్థుల వ్యక్తిత్వం, వ్యతిరేకత, పంపిణీ చేసిన నగదు, తదితర ఆధారంగా గెలుపోటములను అంచనాలు వేసుకున్నారు.

మొన్నటి వరకు ప్రచారం

మొన్నటి వరకు గ్రామాల్లో, పట్టణాల్లో ఎన్నికలు అభ్యర్థుల ప్రచార రథలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, వీధిల్లో తిరుగుతూ ప్రచారం హోరెత్తించారు. ఎన్నికల ముందు రోజు రాత్రి పంపకాల పై చర్చ జరుగుతే.., పోలింగ్ ముగిసింది. అభ్యర్థులు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు, కార్యకర్తలు, గల్లీ లీడర్లు ఇప్పుడు గెలుపు ఓటములపై బేరసాలు వేసుకుంటున్నారు. పోలైన ఓట్లు, వచ్చే ఫలితాలు ఇలా ఉంటాయనే ఆలోచనలో ఎవరికి వారు అంచనా వేసుకుంటున్నారు.

గెలుపోటములపై నాయకుల ఆరా

జన్నారం: అన్నా..మీ మండలంలో ఎన్నికలు ఎంత పర్సెంటేజీ అయ్యాయి. ఎలా జరిగాయి మన పార్టీకి ఎన్ని ఓట్లు పడతాయి. మనోడు గెలుస్తాడా అని ఓ మండలానికి చెందిన నాయకుడు మరో మండల నాయకుడికి ఫోన్ చేసిన ఆరా తీసిన వైనం.

అన్నా.. మనోడు గెలుస్తున్నాడు. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే. ఇక భయపడేది లేదు. మనం కష్టపడ్డందుకు గెలుస్తున్నం. మన పార్టీకి చెందిన కొందరు ఎన్నికల సరళిపై సర్వే చేశామని మరో పార్టీకి చెందిన నాయకులు మాట్లాడుకున్న వైనం.

అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసి ఇక కౌంటింగ్ ఉన్నందున వివిధ పార్టీల నాయకులు ఎవరి లెక్కల్లో వారు మునిగితేలారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల సరళి, ఓట్లుపడిన తీరుపై నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులతో ఆరా తీయడం కనిపించింది. ఖానాపూర్ నియోజకవర్గంలో 2,20,526 మంది ఓటర్లుండగా 77.45 శాతం పోలింగ్ నమోదైంది. జన్నారం మండలంలో 43,232 మంది ఓటర్లు ఉండగా 85 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గం మొత్తంగా 60 వేలకు పైబలుకు ఓట్లు వచ్చిన అభ్యర్థి గెలిచే అవకాశాలున్నాయి. కాని ఖానాపూర్ నియోజకవర్గంలో త్రిముఖపోటీ ఉన్నందున, ఎవరు గెలుస్తారనే అంచనా వేయడం కష్టంగా మారినట్లు చెబుతున్నారు. ఈనెల 3న కౌంటింగ్ ఉన్నందున పార్టీ శ్రేణులు అప్పటివరకు గెలుపోటములపై బేరీజు చేసుకోవడం గ్రామాల్లో కనిపిస్తుంది.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ఉట్నూర్‌రూరల్‌: డిసెంబర్ 1న శుక్రవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో తిరుమల శుక్రవారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులకు డిసెంబర్ 1న ప్రత్యేక సెలవు ప్రకటించడం వల్ల మండలస్థాయి అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేక పోవడంతో వాయిదా వేశామన్నారు. తదుపరి సమావేశ నిర్వహణ తేదీని ప్రకటిస్తామన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుమల

క్లుప్తంగా

ఓటేయడంలోనూ ఆమె ఆదర్శం


దండేపల్లి: ఓటేసేందుకు మహిళల క్యూ(ఫైల్)

దండేపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంలో దండేపల్లి మండలంలో మహిళలే ఆదర్శంగా నిలిచారు. మండలంలో మొత్తం 40,828 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 20,014 మంది ఓటర్లు, మహిళలు 20,813 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 15,486 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోగా, మహిళలు 17,227 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడంలోనూ మహిళలే పైచేయిగా నిలిచారు.

వైన్‌షాపు వద్దని ఆందోళన


ఆందోళన చేస్తున్న స్థానికులు

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసే వైన్ షాపు ఇక్కడ వద్దంటూ స్థానికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఎస్సీ కాలనీ బోయవాడ మహిళలు కలిసి నిరసనకు దిగారు. వైన్‌షాప్ ఏర్పాటుతో ఇబ్బందిగా మారుతుందన్నారు. అధికారులు స్పందించి వైన్‌షాపు వేరే చోటికి మార్చాలని కోరారు. మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోసిపోయిన పల్లెలు


నిర్మానుష్యంగా సెన్నెల హన్మాన్ చౌరస్తా

సెన్నెల: మొన్నటి వరకు నాయకులు, ప్రచార రథాలు, ఇంటింటా ప్రచారంతో సందడితో నిండిన పల్లెలు ప్రస్తుతం మూగబోయి శుక్రవారం బోసిపోయి కనిపించాయి. నిత్యం జనంతో సందడిగా కనిపించిన రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. కూలీలు పొలంబాట పట్టారు. వివిధ పార్టీల కార్యకర్తలతో రద్దీగా ఉన్న హోటళ్లు, దుకాణాలు వెలవెలబోయాయి. నెలపాటు ప్రచార సందడి, పోలీసులు చక్కర్లు కొడుతూ కనిపించిన హడావిడి ప్రస్తుతం నిశబ్దం అయిపోయింది. ఓటు వేయడానికి సొంత గ్రామాలకు చేరుకున్న పల్లె ప్రజలతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఓటింగ్ ముగియడంతో ఎటు వాళ్లు అటు వెళ్లిపోయారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


తనిఖీ చేస్తున్న ఎస్సై లింబాద్రి

ఖానాపూర్‌: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్సై జి.లింబాద్రి అన్నారు. శుక్రవారం మండలంలోని తర్లపాడ్-ఖానాపూర్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ చలాన్లు ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని ప్రైవేటు వాహనదారులను ఆదేశించారు. ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపొద్దని అవగాహన కల్పించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయించరూ..



భైంసారూరల్‌: మండలంలోని ఎగ్గాం గ్రామ సమీపంలో భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు జంకుతున్నారు. ఎప్పుడు ఏయే ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టి సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.


యంత్రాలతో వరికోతలు


ఆస్నాద సమీపంలో వరిని కోస్తున్న హార్వెస్టర్

- సులువుగా అవుతున్న పని
- కూలీల కొరతకు చెక్

చెన్నూర్‌రూరల్‌: కూలీలు పత్తి ఏరివేతలో నిమగ్నమై ఉన్నారు. కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. యంత్రాలతో కోతలు సులువుగా అవుతుండటంతో రైతులు అటు యంత్రాలతోనే వరిని కోయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వానకాలంలో రైతులు వరి 1.52 లక్ష పత్తి 1.64 లక్ష, మిర్చి 6వేల ఎకరాల్లో సాగు చేశారు. సోమనపల్లి, కత్తెరసాల, కిష్టంపేట, సుద్దాల, కాచన్‌పల్లి, అంగ్రాజ్‌పల్లి, నాగాపూర్, దాకెపల్లి, ఆస్నాద, కొమ్మెర, పొక్కూరు తదితర గ్రామాల్లో వరి పంట సాగుచేశారు. ఇప్పటివరకు 50శాతానికి పైగా వరికోతలు కోశారు. ఇందులో యంత్రాలతోనే వరి కోతలు కోయించారు. గంటకు సుమారు రూ.3వేలు చెల్లించి యంత్రాలతో కోయిస్తున్నారు. పంట కోతలో యంత్రాలను వినియోగిస్తుండటంతో రైతులకు సమయాన్ని ఆదా అవుతుంది. పత్తి తీతలో కూలీలు ఎక్కువగా నిమగ్నమై ఉన్నారు. అలాగే మిర్చి పంటకు ఎక్కువగా శ్రమించాల్సి ఉంటుంది. మిర్చి పంటకు ప్రతిసారి తడుపు పెట్టిన అనంతరం గడ్డి పుడుతుం డడంతో కూలీలతో రైతులు కలుపు తీయించాల్సి వస్తుంది. దీంతో కూలీల కొరత ఏర్పడుతుంది. రైతులకు తక్కువ సమయంలో కోతలు అవుతుండటం, శ్రమ తక్కువ, సమయం ఆదా, సులువుగా పని అయ్యేందుకు వరికోత యంత్రాలతో వరిని కోయిస్తున్నారు. యంత్రాలతో వరిని కోయడంతో తక్కువ గడ్డి వచ్చి పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశాలున్నాయి.

సులువుగా పని అవుతుంది



యంత్రాలతో వరిని కోయించడంతో శ్రమ ఎక్కువగా ఉండదు. పని సులువుగా అవుతుంది. సమయం ఆదా అవుతుంది. కూలీలకు అయ్యే ఖర్చుతో యంత్రాలతో పని త్వరగా అవుతుంది.

– మల్లేశ్, రైతు, సుద్దాల

కూలీలు దొరకక



కూలీలు సరిగా దొరకడం లేదు. యంత్రాలతో వరిని కోయిస్తున్నాం. యంత్రాలతో శ్రమ తక్కువగా ఉంటుంది. సమయం కూడా ఆదా అవుతుండటంతో యంత్రాలతోనే వరిని కోయిస్తున్నాం.

– అంకయ్య, రైతు, ఒత్కులపల్లి

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ


ర్యాలీలో విద్యార్థులు, అధ్యాపకులు

మంచిర్యాలఅర్బన్‌: మంచిర్యాల వృత్తి విద్య జూనియర్ కళాశాల, సాయి పారామెడికల్ ట్రెనింగ్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ఎయిడ్స్ వ్యాధి, జాగ్రత్తలపై వివరించారు. అధ్యాపకులు మహాలక్ష్మి, సౌమ్య, సుధారాణి, వల్లవి, ఖాజామాన్సీన్, రాకేశ్ పాల్గొన్నారు.


లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గిరిజన బాలికల వసతి గృహం సిబ్బంది విద్యార్థులతో ఎయిడ్స్ డే ఆకారంలో కూర్చున్నారు. వైద్యులు శ్రీనివాస్, సురేష్, సిబ్బంది, వసతి గృహం హెచ్‌ఎం గఫార్, హెచ్‌డబ్ల్యూవో శోభారాణి, సిబ్బంది రజిత, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


ఎయిడ్స్ డే ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

ప్రమాదకరంగా..



దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లిలో మంచి నీటి పథకానికి సంబంధించి రోడ్డు పక్కనే గేట్‌వాల్వ్ కుండీలు ఏర్పాటు చేశారు. కుండీలపై కప్పు వేయకుండా తెరిచిఉంచారు. దీంతో రోడ్డు వెంట వెళ్లేటప్పుడు ఏ మాత్రం ఆదమరిచిన అందులో పడిపోవడం ఖాయం. ప్రమాదకరంగా ఉన్న గేట్‌వాల్వ్ కుండీలపై కప్పులు వేయాలని పలువురు కోరుతున్నారు.







గుంతలు పూడ్చేదెన్నడో!

చెన్నూర్‌రూరల్‌: మండలంలోని అక్కెపల్లి గ్రామ సమీపంలో, చింతలపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళ గుంతలు కనపించక ద్విచక్రవాహనదారులు కిందపడుతున్నారు. అధికారులు పట్టించుకుని గుంతలు పూడ్చివేసేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో పీహెచ్‌సీ క్వార్టర్లు



దండేపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో సిబ్బంది కొందరు, అద్దెఇళ్లల్లో ఉంటున్నారు. పీహెచ్‌సీలో పనిచేసే వైద్యుడు, ఫార్మసిస్టు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, అటెండర్ ఉండేందుకు 20 ఏళ్ల క్రితం పీహెచ్‌సీ ఆవరణలో క్వార్టర్లు నిర్మించారు. అప్పటినుంచి వాటికి ఎలాంటి మరమ్మతు చేపట్టకపోవడంతో గోడలు మొత్తం పగుళ్లు తేలాయి. భవనాలు మొత్తం కూలిపోతుండటంతో అందులో సిబ్బంది ఉండేందుకు జంకుతున్నారు. పగుళ్ల తేలిన గోడల సందుల్లో విషపురుగులు వచ్చి చేరడంతో కొందరు భవనాలను ఖాళీ చేసి అద్దె ఇళ్లల్లో ఉంటూ విధులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం ఇద్దరు స్టాఫ్‌నర్సులు శిథిలావస్థలో చేరిన వాటికి చిన్నచిన్న మరమ్మతు చేసుకుని అందులోనే ఉంటున్నారు. ఇక్కడ ఉండాల్సిన కొందరు సిబ్బంది అద్దె ఇళ్లల్లో ఉండటంతో కొంత ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు.